క్లుప్తంగా

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

పెనుబల్లి /కొణిజర్ల: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సంక్షేమ పాలన సాధ్యమవుతుందని కాంగ్రెస్ నాయకుడు కొండూరు సుధాకర్, వైరా నియోజకవర్గ నాయకుడు బాలాజీ నాయక్ అన్నారు. పెనుబల్లి మండలంలోని పాతకుప్పెనకుంట్లలో, కొణిజర్లలోని పెద్దగోపతి గ్రామంలో గడప గడపకు కాంగ్రెస్ నినాదంతో.. ఇంటింటికీ కరపత్రాలు అందిస్తూ.. కాంగ్రెస్ మెనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా బానోత్ బాలాజీ నాయక్, పద్మ దంపతులు సోనియమ్మ సారె పేరుతో మహిళలకు చీరలు అందించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు నారాయణరావు, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, రామకృష్ణారెడ్డి, రాజేష్, ఉమా మహేశ్వరరావు, నవజీవన్, దామోదర్, రాధాకృష్ణ, మాధవరెడ్డి, రమేష్, వినోద్, రాజా, ప్రకాశ్ పాల్గొన్నారు.

బత్తులపల్లిలో అంగన్‌వాడీ భవనం ప్రారంభం

కల్లూరురూరల్: మండలంలోని బత్తులపల్లి పంచాయతీలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని ప్రజాప్రతినిధులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం, 6 నెలల పిల్లలకు అన్న ప్రాసనలు, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ కృష్ణకుమారి, సర్పంచ్ శీలం సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ రఘు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, ఏసీడీపీఓ రత్న, సూపర్‌వైజర్ భవాని, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

సత్తుపల్లి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆంగ్ల విభాగంలో ఎంపికైన సత్తుపల్లికి చెందిన అత్తునూరి శాంతిరెడ్డిని సత్తుపల్లి ప్రభుత్వ పాఠశాల యాజమాన్యం శుక్రవారం ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం యాకూబ్, మురళీమోహన్, షాకీర్ హుస్సేన్, ఆదిశేషు, విమల, రవీందర్‌రెడ్డి, రహీం, రమాదేవి పాల్గొన్నారు.

పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

మధిర: మండలంలోని మాటూరు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం తెలుగు పద్య కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాఠశాల విద్యార్థిని ఉమా వెంకటలక్ష్మి తెలుగు సంవత్సరాలు 60 పేర్లు చూడకుండా, ఒక్క తప్పు లేకుండా కంఠస్థంగా చెప్పింది. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంగు కృష్ణ ఆంజనేయులు, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

విద్యార్థులకు సన్మానం

తల్లాడ: మండలంలోని మల్సూర్‌తండాకు చెందిన గుగులోత్ కుశాల్ నాయక్, బానోత్ సైనుబాయి, కాపర్తి మోక్షిత్‌లు హైదరాబాద్ హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశానికి అర్హత సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ధర్మసోత్ దశరథ్ నాయక్, హెల్‌హెచ్‌పీఎస్ మండల నాయకులు గుగులోత్ నాగేశ్వరరావు, కృష్ణనాయక్, సతీష్, లింగయ్య నాయక్, బిచ్చానాయక్, రమేష్ నాయక్, కృష్ణా నాయక్ పాల్గొన్నారు.

శంకుస్థాపన

కొణిజర్ల: మండలంలోని మోకాలకుంట గ్రామంలో వైఎస్సార్ టీపీ కార్యకర్త ఇంటి నిర్మాణానికి ఆ పార్టీ ఖమ్మం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తుంపాల కృష్ణ మోహన్ శంకుస్థాపన చేశారు. మోకాలకుంట గ్రామస్తురాలు పఠాన్ ఆమన్ వైఎస్ షర్మిలమ్మ పాదయాత్రలో ఆమె వెంట నడిచారు. ఇటీవల ఆమె మృతి చెందడంతో షర్మిలమ్మ ఆమె కుటుంబానికి అండగా ఉంటానన్నారు. ఈ మేరక షర్మిలమ్మ ఆదేశాల మేరకు ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామ్ నాయక్, మర్రి శ్రీనివాస్, నంబూరి కార్తీక్, జకరయ్య, ఉదయ్‌కుమార్, ఆమన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వేప చెట్టుకు పాలు !

పెనుబల్లి: మండలంలోని వీఎం.బంజర్ అంబేద్కర్ సెంటర్ నుండి పెనుబల్లి వెళ్లే మార్గంలో ఉన్న వేపచెట్టుకు పాల వంటి ద్రవం కారుతోంది. ఈ విషయాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించారు. రోడ్డు పక్కనే ఉన్న వేప చెట్టు కాండం నుంచి పాల రంగులో ఉన్న ద్రవం వస్తుండడంతో స్థానికులు ఆసక్తిగా చూస్తున్నారు.

అవకాశం ఇవ్వండి : కోటేశ్వరరావు

మధిర: బీజేపీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని ఎర్రుపాలెం మండలకేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు దేవరకొండ కోటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ అభ్యర్థిగా దరఖాస్తు చేసి, ఆ పత్రాన్ని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో అందచేసినట్లు ఆయన తెలిపారు. పార్టీకోసం పనిచేస్తున్న తనకు మధిర నియోజకవర్గ సీటు కేటాయించాలని కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

ఏన్కూరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీపీ ఆరెం వరలక్ష్మి కోరారు. శుక్రవారం మండలంలో నిర్వహించిన ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంపీడీఓ వేణుమాధవ్, ఉపసర్పంచ్ వేముల రమేష్‌బాబు, ఎంపీటీసీ చీరాల కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఎఎన్‌ఎం రమణ పాల్గొన్నారు.

భయం.. భయంగా

శిథిలావస్థలో విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం

- పెచ్చులూడుతున్న విద్యుత్ కంట్రోల్‌రూం, ఏఈ కార్యాలయం
- కాలం చెల్లిన భవనాల్లోనే ఉద్యోగుల విధులు
- 48 ఏళ్లుగా ఇదే పరిస్థితి
- ఆరేళ్లుగా మరమ్మతులతోనే సరిపుచ్చుకుంటున్న వైనం



తల్లాడ 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్



శిథిలావస్థకు చేరిన సబ్‌స్టేషన్ కార్యాలయం



గోడపై ఏర్పడిన పగుళ్లు

48 ఏళ్ల క్రితం నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరి కూలే దశలో ఉన్నది. మండలానికి విద్యుత్ వెలుగులు అందిస్తున్న కార్యాలయం గురించి పట్టించుకున్న నాథుడు లేడు. దీంతో విద్యుత్ శాఖాధికారి కార్యాలయం, కంట్రోల్ రూం పగుళ్లిచ్చి ప్రమాదం పొంచి ఉంది. స్థలం ఉన్నా ఇక్కడ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. దీంతో ఈ భవనాలు విషపురుగులకు నిలయాలుగా మారాయి.

తల్లాడ: మండలానికి వెలుగులు ప్రసాదిస్తున్న 33/11కేవి విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం, కంట్రోల్ రూం కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. సబ్ స్టేషన్ కార్యాలయాన్ని.. 1976లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ప్రారంభించారు. ఈ క్వార్టర్లోనే విద్యుత్ ఏఈ కార్యాలయం, కంట్రోల్ రూం నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం క్వార్టర్స్ చుట్టూ దట్టంగా పిచ్చి చెట్లు పెరిగి అందులో పాములు, తేళ్లు, విషపురుగులు నివాసం ఉంటున్నాయి. కార్యాలయం తలుపులు కూడా సరిగా లేకపోవటంతో ఒక్కోసారి కార్యాలయంలోనికి ప్రవేశిస్తున్నాయి. సిబ్బంది విధులకు ఆటంకం కలుగుతుంది. రాత్రి పగలు బిక్కు బిక్కుమంటూ భయంతో.. శిథిలావస్థలో ఉన్న కార్యాలయంలోనే విధులు నిర్వహించాల్సి వస్తోంది. కార్యాలయం శ్లాబ్ భాగం కూడా పగుళ్లిచ్చి, గోడలు నెర్రలు బాచి వర్షం కురుస్తోంది. దీంతో విలువైన ఫైళ్లు కూడా తడుస్తున్నాయి.

స్థలం ఉన్నా భవనాలు నిర్మించటం లేదు..

తల్లాడ సబ్ స్టేషన్ కింద ప్రస్తుతం 5 ఎకరాల స్థలం వరకు ఉంది. స్థలం ఉన్నా విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం, కంట్రోల్ రూం నిర్మాణానికి విద్యుత్ శాఖా నుంచి నిధులు మంజూరు కావడం లేదు. దీంతో అటు సిబ్బంది, ఇటు వినియోగదారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకు గదుల్లో తమ పనులు ముగించుకొని వెళ్లాల్సి వస్తోంది.

ఫెన్సింగ్ లేక ఇక్కట్లు..

సబ్ స్టేషన్ చుట్టూ ఫెన్సింగ్ లేకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. ఫెన్సింగ్ లేకపోవడంతో పశువులు, ఇతర జంతువులు సంచరిస్తున్నాయి. దీంతో సబ్ స్టేషన్‌లో విద్యుత్ ప్రమాదం పొంచి ఉంది. సబ్‌స్టేషన్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

పక్కా భవనాలు నిర్మించాలి..



విద్యుత్ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించాలి. ఈ భవనాలు శిథిలమవడంతో శ్లాబ్ పెచ్చులూడి పడుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్లదీయాల్సి వస్తుంది. భయంగానే విధులు నిర్వహిస్తున్నాం.

– మరియదాసు, లైన్ ఇన్‌స్పెక్టర్, తల్లాడ

నిధులు మంజూరు చేయాలి..



తల్లాడ విద్యుత్ సబ్‌స్టేషన్ నూతన భవనం, కంట్రోల్ రూం ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలి. ఈ ప్రాంతంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించిన సమయంలో క్వార్టర్స్ నిర్మించారు. అప్పటి నుంచి తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్నారు.

– సరికొండ లక్ష్మీపద్మావతి, మాజీ ఎంపీపీ, తల్లాడ

ఘనంగా సామూహిక కుంకుమార్చన

వైరా: వైరాలోని శిరిడీ సాయి మందిరంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న మహిళలకు లయన్స్‌క్లబ్ వారు కుంకుమ భరిణలను కానుకగా అందించారు. కార్యక్రమంలో సాయి మందిర కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, సత్యనారాయణ, దుర్గాప్రసాద్, వేణుగోపాలరెడ్డి, లయన్స్‌క్లబ్ సభ్యులు మధు, ఉపేందర్‌రావు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, వార్డు కౌన్సిలర్ సునీత పాల్గొన్నారు.

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో..

మధిర: మధిర పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా మహిళలు ప్రత్యేక అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం వాసవి మాత అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ అధ్యక్షులు కపిలవాయి జగన్మోహన్‌రావు, అర్చకులు శ్రీనివాసుల శేషాచార్యులు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారికి లలిత విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.



తల్లాడ: నారాయణపురంలో పూజల్లో పాల్గొన్న మహిళలు

శ్రీజ్ఞానసరస్వతీదేవి ఆలయంలో..

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని శ్రీజ్ఞానసరస్వతీదేవి ఆలయంలో.. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు, సరస్వతీపూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కిషోర్‌శర్మ, ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో..

తల్లాడ: మండలంలోని నారాయణపురం గ్రామంలో ముత్యాలమ్మకు మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కంచెల సతీష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

వితరణల వెల్లువ..

నిరుపేద కుటుంబానికి నిత్యావసరాలు ..

కారేపల్లి: మండలంలోని పేరుపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబాలకు బోడెపూడి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను శుక్రవారం పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న పూనెం కొండమ్మతో పాటుగా నిరుపేద కుంటుంబాలైన సంకిని, ఆదిలక్ష్మలకు నిత్యావసర సరుకులు అందించారు. అనంతరం పేరుపల్లి గ్రామ యువకులకు క్రికెట్ కిట్ అందజేశారు. బోడెపూడి ట్రస్టు చైర్మన్ రాజా, ఎస్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా అధ్యక్షుడు షరీఫ్ పాషా, ఉపాధ్యక్షుడు ప్రసాద్, పాల్గొన్నారు.

గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్ విరాళం..

వైరా: వైరా గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్ వారు కేన్సర్ పేషంట్‌కు రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. కొణిజర్ల మండలం గుబ్బగుర్తికి చెందిన బందారు ఉమేష్ కేన్సర్‌తో బాధ పడుతున్న విషయం తెలుసుకున్న వైరా గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్ సభ్యులు పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీ కృష్ణ చేతుల మీదుగా పదిహేను వేలు ఆర్థిక సాయం అందజేశారు. క్లబ్ అధ్యక్షురాలు ఉంద్రు వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జీఎంటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు, ఆర్‌సీ లగడపాటి ప్రభాకర్‌రావు, శ్రీకాంత్, కిషన్‌రాయ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'సూర్యోదయ' చేయూత..

కొణిజర్ల: మండలంలోని గుబ్బగుర్తికి చెందిన బందారు ఉమేష్ బ్లడ్ కేన్సర్‌తో భాదపడుతున్నాడు. విషయం తెలుసుకున్న సూర్యోదయ సామాజిక సేవా సంఘం రూ.10 వేలను ఉమేష్ చికిత్స నిమిత్తం అతని తండ్రికి శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సంఘం సభ్యులను అభినందించారు.

పరామర్శ

చింతకాని: మండలంలోని కొదుమూరు గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న సీపీఎం సీనియర్ నాయకుడు సారక వెంకటేశ్వర్లును పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు శుక్రవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గోపాలరావు, మండల నాయకులు జానికి రాములు, రాము, ఉపేందర్ పాల్గొన్నారు.

పోషకాహార వారోత్సవాలు

పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో పోషణ్ అభియాన్ అవగాహన సదస్సులు నిర్వహించారు. పోషక విలువలున్న కూరగాయలు, ఆకుకూరలు, వంటకాల ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సామూహిక సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. పలుచోట్ల ర్యాలీలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



మధిర: అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



ఏన్కూరు: తూతకలింగన్నపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



బోనకల్ : చొప్పకట్లపాలెంలో సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏన్కూరు: మండలంలోని జన్నారంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాలయం ఏర్పడుతుందని ఏఈ ఉమాకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు దృష్ట్యా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల 33/11 విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తనికెళ్ల, అమ్మపాలెం, రాజ్యాతండా, గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు తెలిపారు.

కేసు నమోదు

చింతకాని: ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన తుడుం హైమావతి, వెంకటేశ్వర్లు పశువులను పొలంలో మేపారన్న కారణంతో అదే గ్రామానికి చెందిన కన్నెపోగు సుధాకర్, కోటయ్యతో పాటు మరో ఇద్దరు దాడి చేసి గాయపర్చారు. హైమావతి చేసిన ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేందర్ నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ముదిగొండ: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన ముదిగొండ మండలం కోదండరాంపురం సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కోదండరాంపురానికి చెందిన శ్రీను భార్యతో కలిసి ద్విచక్రవాహనంపై వెళుతుండగా పండ్రేగుపల్లినుంచి వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ క్రమంలో శ్రీనుకు గాయాలైయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

ఉచిత వైద్య శిబిరం

తల్లాడ: మండలంలోని బాలపేట, గోపాలపేట, కొడవటిమెట్ల గ్రామాల్లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి రత్న మనోహర్ శిబిరానికి వచ్చిన అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆల్తాఫ్, గోపి, శ్రీకాంత్, విజయ్ చందర్, పెద్ద పుల్లయ్య, మరియమ్మ, జయమ్మ, ఎఎన్‌ఎంలు జ్యోతి, త్రివేణి, శారద, అరుణిమ పాల్గొన్నారు.

రాజులదేవరపాడులో ఉచిత హోమియో శిబిరం

ఎర్రుపాలెం: మండలంలోని రాజులదేవరపాడు గ్రామపంచాయతీలో శుక్రవారం హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని స్థానిక సర్పంచ్ వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. పలువురు రోగులకు హోమియో డాక్టర్ శ్రీనివాస్ నాయక్, సర్పంచ్ వేమిరెడ్డి సుధాకర్ రెడ్డిలు మందులు పంపిణీ చేశారు. ప్రతి గురువారం, శుక్రవారం, శనివారాలల్లో హాస్పటల్‌లో అందుబాటులో ఉంటామని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ 'గృహలక్ష్మి' వర్తింపజేయాలి

మధిర /కల్లూరురూరల్ /సత్తుపల్లిటౌన్ /పెనుబల్లి: అర్హులందరికీ గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలని సీపీఎం మండల కార్యదర్శి మందా సైదులు, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు వెంకన్న, గంటా శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సీపీఎం, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో మధిర, కల్లూరు, సత్తుపల్లి, పెనుబల్లిలో తహసీల్ ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాలను సత్తుపల్లి, కల్లూరు తహసీల్దార్లు యోగీశ్వరరావు, బాబ్జీప్రసాద్‌లకు, పెనుబల్లి తహసీల్ యూడీసీ మొహిద్దీన్‌కు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రేషన్ కార్డులు ఉన్నా.. లేకపోయినా ఇంటి స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని.. ఇళ్ల స్థలాలు ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు ఉండి రేషన్‌కార్డు లేక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. పెరిగిన ధరలను నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పుల్లారావు, మల్యాద్రి, పరిమళ, మంగయ్య, సీతారాములు, సీపీఎం నాయకులు చలమాల విఠల్‌రావు, గాయం తిరుపతిరావు, గుడిమెట్ల బాబు, సత్యనారాయణ, కొర్రయ్య, నాగమణి, పంది ప్రసాద్, మద్దాల ప్రభాకర్, వూట్ల శంకర్‌రావు, వడ్రాణపు మధు, తేలప్రోలు రాధాకృష్ణ, పడకంటి మురళి, నాయుడు శ్రీరాములు, పుచ్చకాయల కిషోర్, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా డివిజన్ నాయకుడు అమరపుడి శరత్, మండల కార్యదర్శి తాటి రాజు, కొర్స వెంకటేష్, రుద్రాక్షపల్లి ఉపసర్పంచ్ రాఘవులు, అలివేలు, నాగరాజు, శ్రీను, వెంకటమ్మ, సురేష్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



మధిర: మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



చింతకాని: తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

బోనకల్/చింతకాని: సమస్యల పరిష్కారం కోరుతూ సెప్టెంబర్ 11వ తేదీన నిర్వహించే అంగన్‌వాడీ టీచర్ల సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు బోయినపల్లి వీరబాబు, మడుపల్లి గోపాలరావులు తెలిపారు. ఈ సందర్భంగా బోనకల్, చింతకాని తహసీల్దార్లు పున్నం చందర్, రమేష్‌లకు శుక్రవారం సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లను రెగ్యూలర్ చేయాలని, పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాలకు తగ్గించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను టీచర్‌కు 10 లక్షలు, ఆయాకు 5 లక్షలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాయల విజయలక్ష్మి, చేబ్రోలు ఉష, రావణ సునీత, మరియమ్మ, నాగలక్ష్మి, అచ్చమాంబ, భద్ర, బేబీ, కుమారి, స్వరూప, రాణి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల అనుబంధ ఏఐటీయూసీ కమిటీ ఎన్నిక ..

కారేపల్లి: అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ అనుబంధ ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా జె.సుజాత, కె.లక్ష్మి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం కారేపల్లిలో జరిగిన అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమావేశంలో కామేపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు మంద మరియమ్మ, తలారి విజయకుమారి మాట్లాడుతూ.. సక్రమంగా విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను పాలక ప్రభుత్వాలు పర్మినెంట్ చేయడంలో తాత్సారం చేస్తున్నాయన్నారు.

దళితబంధు ఎంపికలో జోక్యం తగదు..

వైరా: గత ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా గెలిచిన తాను, ఏమీ ఆశించకుండా బీఆర్‌ఎస్‌లో చేరానని.. ఈసారి టికెట్ రాకున్నప్పటికీ అభ్యర్థి విజయానికి సహకరిస్తానని చెబుతుండగానే దళితబంధు లబ్ధిదారుల ఎంపికలో ఇతరులు జోక్యం చేసుకోవడం తగదని వైరా ఎమ్మెల్యే రాములునాయక్ అన్నారు. వైరాలో శుక్రవారం జరిగిన బీఆర్‌ఎస్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన నియోజకవర్గానికి సంబంధించి దళితబంధు లబ్ధిదారుల జాబితాను ఉన్నతాధికారులకు పంపానని తెలిపారు. ఇంతలోనే ఎమ్మెల్యే అభ్యర్థి మదన్‌లాల్ మరో జాబితాను ఉన్నతాధికారులకు ఇచ్చారని ఆరోపించారు. తనకు ఎమ్మెల్యే సీటు ఇవ్వకపోయినా, మదన్‌లాల్‌కు సహకరిస్తానని చెప్పానని గుర్తు చేశారు. అయినప్పటికీ దళితబంధు విషయంలో ఇలా చేయడం సబబు కాదని సూచించారు. కాగా, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సామంతరాజులా వ్యవహరిస్తున్నారని రాములునాయక్ ఆరోపించారు. ఆయన తన నియోజకవర్గ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని మండిపడ్డారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాములునాయక్

కార్మికులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు



రిలే నిరాహారదీక్ష చేస్తున్న సింగరేణి కార్మికులు

సత్తుపల్లిరూరల్: సింగరేణి కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ అన్నారు. శుక్రవారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ సత్తుపల్లి బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో ఒక్క రోజు నిరాహార దీక్షను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ.. సింగరేణిలో వేలకోట్ల రూపాయల లాభాలు వస్తున్నా.. సకాలంలో జీతాలు, ఏరియాస్ ఇవ్వలేని దుస్థితి ఏర్పడిందన్నారు. సింగరేణి కార్మికులకు 11వ వేజ్‌బోర్డు చెల్లించవలసిన 23 నెలల ఏరియల్స్ ఒకేసారి చెల్లించాలన్నారు. అదే విధంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ కమిటీ సభ్యులు సముద్రాల సుధాకర్, దారా భీమయలు మాట్లాడారు. కార్మిక సమస్యలపై సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నిరంతరం పోరాడుతుందన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేయడానికి కూడా వెనకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో సముద్రాల సుధాకర్, బ్రాంచ్ కార్యదర్శి భీమయ్య, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ సూర్యప్రకాష్, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి భరణి, జాయింట్ సెక్రటరీ నరసింహారావు, కోశాధికారి నర్సింహారావు, జేవీఆర్ ఓసీ ఫిట్ సెక్రటరీ శేఖర్, అసిస్టెంట్ సెక్రటరీ కిషోర్‌కుమార్, ఫిట్ సెక్రటరీ కిష్టారం అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ అజ్మత్ జి.నాగేశ్వరరావు, మధుకుమార్, దేవదాసు, సుధాకర్, జయరాజు, కృష్ణ, వినయ్, వెంకటేశ్వర్లు, శ్రీధర్, బద్రు, రవిశంకర్, మోతిలాల్, సుధాకర్ పాల్గొన్నారు.

సీపీఎం చింతకాని గ్రామ కార్యదర్శిగా కోటేశ్వరరావు



కోటేశ్వరరావు

చింతకాని: సీపీఎం చింతకాని గ్రామశాఖ కార్యదర్శిగా గడ్డం కోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చింతకానిలో శుక్రవారం పార్టీ గ్రామ శాఖ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి గోపాలరావు, నాయకులు జానికీరాములు, కృష్ణమూర్తి, రమణ, రవి, ఉపేందర్, కిరణ్‌బాబు, శ్రీనివాసరావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫిజియోథెరపీ దినోత్సవం

కల్లూరు: మండలంలో ఫిజియోథెరపీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్‌నగర్ యూపీఎస్‌లో శుక్రవారం ఫిజియోథెరపిస్ట్ మాగంటి ప్రభాకర్ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలతో కేక్ కట్ చేయించి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఎంఈఓ దామోదర ప్రసాద్, డాక్టర్ నవ్యకాంత్‌లు మాట్లాడుతూ.. పిల్లలు ఉచిత ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు సృజన, సుధారాణి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ ముట్టడిని జయప్రదం చేయండి

ఏన్కూరు: ఈ నెల 11న తహసీల్దార్ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని సీపీఎం మండల నాయకుడు ఏర్పుల రాములు కోరారు. శుక్రవారం మండలంలోని ఎర్రబోడుతండలో సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలక ప్రభుత్వాలు నిర్వహించే ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టే.. తహసీల్ ముట్టడి కార్యక్రమానికి సీపీఎం కార్యకర్తలు, అభిమానులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బానోత్ బాలాజి, ఇటికాల లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

వైరారూరల్: మండలంలోని జింకలగూడెం గ్రామంలో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకంలో అవకతవకలు జరుగుతున్న నేపథ్యాన గ్రామ సభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, సీపీఎం నాయకులు షేక్.మస్తాన్, షేక్.షంషేర్, అల్లావలీ పాల్గొన్నారు.



వైరారూరల్: కరపత్రాలతో నాగేశ్వరరావు, గ్రామస్తులు